# అమాత్యా.. మీకిది తగునా?

- సమస్యలపై వినతులిస్తే గాలికొదిలేసి వెళ్లిన మంత్రి
- ఉద్యోగులు, వైద్య విద్యార్థుల ఆవేదన

సాక్షి, అమరావతి/గుణదల (విజయవాడ తూర్పు): విశాఖపట్నంలోని కింగ్‌జార్జి ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్, ఐఆర్‌సీయూ యూనిట్‌లను ప్రారంభించేందుకు ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ బుధవారం వెళ్లారు. కొంతమంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు తమకు సకాలంలో స్టైఫండ్ ఇవ్వడం లేదని ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. అక్కడి ట్రామాకేర్ సిబ్బంది కూడా తమకు వేతనాలు పెంచడం లేదని వినతులు ఇచ్చారు. అవి తీసుకున్న కామినేని శ్రీనివాస్ మరుక్షణమే వాటిని అక్కడే పడేశారని, తమ సమస్యలపై కనీసం పరిశీలించకుండానే వెళ్లడం బాధాకరమని సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, ట్రామాకేర్ సిబ్బంది వాపోయారు. కామినేని తీరు ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్నా వేతనాలు పెంచకపోగా తమ వినతులను తమ కళ్లముందే పడేసి వెళ్లిపోవడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని రాష్ట్ర ట్రామాకేర్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి సుధాకర్‌రావు అన్నారు.

**రక్తమూల కణాలు దానంపై అవగాహన అవసరం**

రక్తమూల కణాలు దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. విజయవాడ రామవరప్పాడు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం రక్తమూల కణదాతల స్వచ్ఛంద సంస్థ ధాత్రి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి ముందుకొచ్చిన దాతల పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతరం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి సర్వేష్ ప్రాణాలు నిలబెట్టిన దాత బెల్లం చైతన్యను మంత్రి కామినేని తదితరులు సన్మానించారు.



తన మూల రక్తకణాల దానంతో ప్రాణాలు పోసుకున్న సర్వేష్‌ను ఎత్తుకుని ముద్దాడుతున్న దాత బెల్లం చైతన్య. చిత్రంలో మంత్రి కామినేని

సాక్షి SAKSHI TELUGU DAILY
Thu, 14 September 2017
epaper.sakshi.com//c/22109721